

## కథ

వాణిశ్రీ

# అంతా అబద్ధం

మల్లిఖార్జునరావు పొద్దున్నే ఇంటికి వచ్చాడు.

"గుడ్‌మార్నింగ్ శివరామ్‌గారూ!" అంటూ పలకరించాడు.

నాకు కొంచెం ఆశ్చర్యం కలిగింది. అతను మా హౌసింగ్ బోర్డు కాలనీలోనే ఉంటాడు. బాగా రిజర్వుడు. అవసరం లేనిదే మన ముఖం కూడా చూడడు. ఏదైనా తనకి అవసరమైతే మొఖమాటం లేకుండా వచ్చి పలకరిస్తాడు. ఇతగాడికి నాతో ఏం అవసరమో! అని సందేహం కలిగింది.

"గుడ్ మార్నింగ్" అని కూర్చోమని సీటు చూపించాను.

"ఎ.శ్రీనివాసరావుగారు, కర్నూలులో ఉంటారు. మీకు బాగా క్లోజ్ ఫ్రెండట గదా?" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. ఆ సంగతి ఈయనకు ఎలా తెలిసిందా? అని.

"ఔనండీ! నా క్లాస్‌మేట్. మీకెవరు చెప్పారీ సంగతి?" అని ప్రశ్నించాను.

"శ్రీనివాసరావుగారే చెప్పారు."

"అలాగా! ఎక్కడ కనిపించాడు?"

"ఆయన కూతురుకి సంబంధాలు చూస్తున్నాడని మీడియేటర్ అడ్రస్ ఇచ్చాడు. నేను మావాడి బయోడేటా, ఫోటో పంపాను. అది ముట్టిన తర్వాత ఫోన్ చేశాడు. వచ్చే ఆదివారం ఇక్కడికి వస్తున్నాననీ, హౌసింగ్ బోర్డు కాలనీలో మా ఫ్రెండ్ ఇంట్లో బస చేస్తాననీ!"

"అదా!... ఇప్పుడు అర్థమైంది" అని నవ్వాను.

"ఈ సంబంధం కుదిరితే లక్కీయేనని మీడియేటర్ చెప్పాడు. శ్రీనివాసరావుకి బాగా ఆస్తి ఉందనీ, ఒక్క కూతురు, ఒక కొడుకేననీ... అల్లుడికి బాగా కట్నం ఇస్తారనీ..!"

మల్లిఖార్జునరావు చెప్పుకుపోతుంటే 'వూ' కొడుతున్నాను.

"సర్లెండి. సండే నాకు సెలవేగా! మా వాడిని తీసుకుని మీ ఇంటికి వస్తాను" అని ప్రామిస్ చేశాను.

"మీరు ఎటూ వస్తారు. మా వాడి గురించి బాగా చెప్పాలి." అన్నాడు.

"అలాగే! మీ వాడికేం? కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్, జీతంతో పాటు గీతం వస్తుంటుంది" అని నవ్వాను.

"అమ్మమ్మ! గీతం సంగతి ఎత్తకండి. మీడియేటర్ చెప్పాడు, ఆయన చాలా ప్రిన్సిపుల్స్ ఉన్న మనిషని. మా వాడు నీతీ నిజాయితీ ఉన్నవాడనీ, మందు మాకు, జూదం వంటి అలవాట్లు లేవని చెప్పాలి" అన్నాడు మల్లిఖార్జునరావు.



"అలాగే! వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్లి చెయ్యమన్నారు. మీ వాడు సిన్సియర్ ఆఫీసరనీ, వ్యాపారస్తులను గడగడలాడించి టాక్సులు వసూలు చేస్తాడనీ, గవర్నమెంట్ ఖజానా నింపుతూ దేశ సేవ చేస్తున్నాడని చెప్తాను. సరేనా!" అని భరోసా ఇచ్చాను.

మల్లిఖార్జునరావు సంతృప్తిపడిపోయి "థాంక్యూ వెరీ మచ్" అని చేతులు ఊపి వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన కాసేపటికే కర్నూలు నుంచి శ్రీనివాసరావు ఫోన్ చేశాడు.

* * *

ఆదివారం శ్రీనివాసరావు, నేను, మల్లిఖార్జునరావు ఇంటికి వెళ్లాం. వాళ్లబ్బాయి శ్రీరామ్ ఇంట్లోనే ఉన్నాడు. మమ్మల్ని రిసీవ్ చేసుకుని మర్యాద చేశాడు మల్లిఖార్జునరావు.

"శ్రీరామ్ సిన్సియర్ ఆఫీసరోయ్. బిజినెస్ పీపుల్ ముక్కు పిండి టాక్సులు వసూలు చేస్తాడట. వాళ్లంతా శ్రీరామ్ అంటే గడగడలాడతారు. తొందర్లోనే గవర్నమెంట్ అవార్డ్ కూడా ఇస్తారని పుకారొకటి ఉంది" అని నోటికొచ్చినట్లు శ్రీరామ్‌ని పొగిడాను.

పాపం శ్రీరామ్ సిగ్గుపడిపోయాడు. పడడూ మరి. ఒకవైపు లంచాలు మేస్తూ ఎడాపెడా సంపాదిస్తున్నవాడిని నిజాయితీపరుడని పొగిడితే అంతే మరి.

కతికితే అతకదని అంటూ శ్రీనివాసరావు వాళ్లింట్లో పెట్టిన ఫలహారాలు ముట్టుకోలేదు. మర్యాద కోసం కాఫీ తాగి వచ్చేం. తర్వాత అర్జెంట్ పని ఉందంటూ వెళ్లిపోయాడు శ్రీనివాసరావు. కర్నూలు వెళ్లి భార్యతో మాట్లాడి ఫోన్ చేస్తానని అన్నాడు.

నేనిక పట్టించుకోలేదు. ఆఫీసు బిజీలో పడిపోయాను. పది రోజుల తర్వాత మల్లిఖార్జునరావు వీధిలో కనిపించి నన్ను చూసి స్కూటర్ ఆపాడు.

"కర్నూలు నుంచి శ్రీనివాసరావు ఫోన్ చేశాడా? పిల్లను చూసుకోవడానికి రమ్మని ఆహ్వానించాడా?" అని అడిగాను.

మల్లిఖార్జునరావు తల అడ్డంగా ఊపి "లేదండీ! ఆయనకి మా సంబంధం నచ్చలేదట" అన్నాడు.

"అయ్యో! ఏం?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఏమో!..." అని ముఖం నల్లగా పెట్టుకుని వెళ్లిపోయాడు.

ఇంటికి వెళ్లిన తర్వాత ఫోన్ చేశాను శ్రీనివాసరావుకి.

"ఏవోయ్! సంబంధం నచ్చలేదన్నావంట. ఇందాక మల్లిఖార్జునరావు కనిపించి చెప్పాడు. ఏం? ఎందుకు నచ్చలేదు. కుర్రాడు బాగానే ఉన్నాడుగా? మంచి ఉద్యోగం గూడాను" అని అడిగాను.

"ఉద్యోగం అదీ బాగానే ఉందిలేవోయ్! ఐతే ఏంటి? సిన్సియర్ ఆఫీసరనీ, లంచాలు ముట్టడనీ చెప్పావుగా?"

"ఔను"

"ఈ రోజుల్లో అటువంటివాడు ఎట్లా నెగ్గుకొస్తాడోయ్ డిపార్ట్‌మెంటులో? అసలు ఒకచోట తిన్నగా ఉండనిస్తారంటావా? ఫుట్‌బాల్ తన్నినట్లు సంవత్సరానికి రెండు మూడు ట్రాన్స్‌ఫర్లౌస్తాయి. ఇటువంటి చాదస్తంగాడిని కట్టుకుని అమ్మాయేం సుఖపడుతుందంటావ్?..."

శ్రీనివాసరావు చెప్తుంటే నాకు మతి పోయింది.

"అంతా అబద్ధం" అని అరవాలనిపించింది. కానీ సమయం మించిపోయింది గదా!